


అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక -330 ఆదివారం 5 ఏప్రిల్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## కెసిఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి

**రేవంత్ ఆదేశాలతోనే దాడికి వ్యూహం**

**తీవ్రంగా ఖండించిన హరీష్ రావు**



2లో.

# ఆధ్యాత్మికత ఉట్టిపడేలా

**బాసర మాస్టర్ ప్లాన్‌కు సిఎం రేవంత్ ఓకే**

**రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి**

**6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపన**

**అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించిన రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, ఏప్రిల్ 4 (జర్నలిస్ట్ వార్త):** :బాసర ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 6న బాసర సరస్వతి ఆలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సుమారు రూ. 225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించి సమగ్ర మాస్టర్ ప్లాన్ ఇప్పటికే సిద్ధం కాగా, ఆలయాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. **మిగతా 2లో...**

## 5 కేజీల గ్యాస్ సిలిండర్లకు అడ్రస్ ప్రూఫ్ అవసరం లేదు: కేంద్రం

**ఏదైనా ఐడీ కార్డుతో 5 కేజీల ఎల్పీజీ సిలిండర్**

**అడ్రస్ ప్రూఫ్ అవసరం లేదని స్పష్టం చేసిన కేంద్రం**

**దేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్‌కు కొరత లేదు**




2లో.

## అమరావతిపై తీర్మానం శాశ్వతం కాదు

**సకాలంలో పూర్తి చేయకపోతే ఆలోచిస్తాం**

**బొత్స సత్యనారాయణ సంచలన వ్యాఖ్యలు**



**అమరావతి ఏప్రిల్ 4 (జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అమరావతి రాజధాని అంశంపై మరోసారి చర్చనీయాంశంగా మారేలా వైసీపీ నేత బొత్స సత్యనారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమరావతిపై తీర్మానం చేసినంత మాత్రాన అది శాశ్వతం కాదని, అసలు నిర్మాణం పూర్తి కావడం ద్వారానే రాజధాని స్థిరపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అమరావతికి తాము వ్యతిరేకం కాదని, ఆ పేరుతో జరిగే అవినీతికి మాత్రమే వ్యతిరేకమని అన్నారు. అమరావతి మాకు ప్రయారిటీ కాదు. అది మాకు శాసన రాజధాని మాత్రమే. అలాంటప్పుడు మేమెందుకు రూ.లక్షా పదివేల కోట్లు ఖర్చు చేస్తాం? అమరావతి **మిగతా 2లో...**

# దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదు

**సీట్లు కోల్పోతామన్న వాదనలో అర్థం లేదు**

**కేరళ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ**



2లో.

## కేంద్ర మంత్రి కుమారస్వామికి అండగా ఉండాలి

**: మంత్రి నారా లోకేశ్**

**విశాఖ ఉక్కును కాపాడింది ఆయనేనని ప్రశంస**

**కర్ణాటకలో సైనిక్ స్కూల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఏపీ మంత్రి నారా లోకేశ్**



2లో.

## అణిచివేత, అప్రజాస్వామిక చర్యలకు రాష్ట్రంలో చోటు లేదు

**క్యాతనపల్లి, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలు బీఆర్ఎస్ కైవసం.. స్పందించిన కేటీఆర్**

**కాంగ్రెస్ ఎన్ని అరాచకాలు చేసినా ఆ స్థానాలను బీఆర్ఎస్ దక్కించుకుందన్న కేటీఆర్**



# ప్రళయానికి 48 గంటలే

**ప్రళయం విరుచుకుపడడానికి 48 గంటలే మిగిలి ఉంది: ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం**

**హర్మూజ్ జలసంధిని మూసివేయవద్దని ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక**

**48 గంటల్లో నరకం చూపిస్తామని, 20 రెట్ల బలంతో దాడి చేస్తామని స్పష్టీకరణ**

**ప్రపంచ చమురు సరఫరాపై ప్రభావంతో పెరుగుతున్న గ్యాస్ ధరలు**

**అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో తాజా పరిణామాలు**



**ఏప్రిల్ 4 (జర్నలిస్ట్ వార్త):**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్‌కు అత్యంత తీవ్రమైన హెచ్చరిక జారీ చేశారు. హర్మూజ్ జలసంధిని మూసివేసే ప్రయత్నం చేస్తే కేవలం 48 గంటల్లో ప్రళయం తప్పదని, నరకం చూపిస్తామని అల్టిమేటం ఇచ్చారు. ఈ మేరకు ఆయన తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో పోస్ట్ చేశారు.
ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి ద్వారా సరఫరాను అడ్డుకుంటే, అమెరికా 20 రెట్లు ఎక్కువ బలంతో ప్రతిదాడి చేస్తుందని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం**మిగతా 2లో...**

# ఆ రెండు మున్సిపల్ పీఠాల్లో బీఆర్ఎస్

**ఖానాపూర్ చైర్మెన్ ఎన్నిక మూడోసారి వాయిదా**

**బీఆర్ఎస్, బీజేపీ నాయకుల ఆందోళన**

**పోలీసులు స్వల్ప లాఠీచార్జి క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్**

**-సీపీఐ కైవసం ఇబ్రహీంపట్నం మున్సిపాల్టీ బీఆర్ఎస్‌కే..**



2లో.



## సహజ మరణానికి కూడా పదిలక్షల బీమా

**సింగరేణి కార్మికులకు శుభవార్త**

2లో.

# ఆ రెండు మున్సిపల్ పీఠాల్లో బీఆర్ఎస్

**ఆదిలాబాద్ ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 4 (జర్నలిస్ట్ వార్త):** మున్సిపల్ ఎన్నికల తర్వాత పలు కారణాలతో వాయిదా పడిన పాలకవర్గాల ఎన్నికను అధికారులు పోలీసు బందోబస్తు మధ్య శనివారం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపల్ చైర్మెన్ పీఠాలను ఇతరుల మద్దతుతో బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. కాగా, ఖానాపూర్ ఎన్నిక నాటకీయ పరిణామాల మధ్య మూడోసారి వాయిదా పడింది. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో వాయిదా పడిన రెండు మున్సిపాలిటీ చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నికను పోలీసులు భారీ బందోబస్తు నడుమ నిర్వహించారు. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక భారీ బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసింది. ఈ ఎన్నిక మొదటిసారి కోరం లేక వాయిదా పడగా, రెండోసారి కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల గొడవతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

ఈ ఘర్షణల నేపథ్యంలో చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ జైలుకు వెళ్లిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజార్టీ వచ్చినప్పటికీ మంత్రి వివేక్ వెంకటస్వామి కాంగ్రెస్ అభ్యర్థిని చైర్మెన్‌ను చేయడానికి పట్టుబట్టారు. బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేయడంతో రెండోసారి సైతం ఎన్నిక వాయిదా పడింది. దీంతో పోలీసులు భారీ బందోబస్తు నడుమ శనివారం నిర్వహించిన ఎన్నికలో బీఆర్ఎస్‌కు 10 స్థానాలు రాగా.. సీపీఐ నుంచి గెలుపొందిన నలుగురు కూడా ఆ పార్టీకి మద్దతు తెలపడంతో మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. చైర్‌పర్సన్‌గా గొడిసెల సంధ్యారాణి ఎన్నికకాగా, వైస్ చైర్‌పర్సన్‌గా సీపీఐ అభ్యర్థి సరిత ఎన్నికయ్యారు.

**ఖానాపూర్ మళ్లీ వాయిదా..**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నికల్లో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్నికను మరోసారి వాయిదా వేస్తున్నట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఖానాపూర్ మున్సిపాలిటీలో 12 కౌన్సిలర్ స్థానాలు ఉండగా.. కాంగ్రెస్ 4, బీఆర్ఎస్ 4, బీజేపీ 4 స్థానాల్లో గెలుపొందాయి. చైర్మెన్ ఎన్నికకు ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో కోరం లేక గతంలో రెండు సార్లు వాయిదా పడింది. శనివారం ఎన్నిక నిర్వహించగా ఇటీవల ఒక బీఆర్ఎస్ కౌన్సిలర్ కాంగ్రెస్‌కు మద్దతు తెలపడంతో ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ ఎక్స్‌అఫీషియో ఓటుతో మొత్తం ఆరు ఓట్లు అయ్యాయి. ఎన్నికల అధికారి సమక్షంలో బీఆర్ఎస్ తరపున బీజేపీ కౌన్సిలర్ అంకం మౌనికను చైర్మెన్ అభ్యర్థిగా ప్రతిపాదించారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు ముగ్గురు, బీజేపీ కౌన్సిలర్లు నలుగురు మొత్తం ఏడుగురు మద్దతు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ అభ్యర్థిగా చిన్న సత్యంను ప్రతిపాదించాలని ఎమ్మెల్యే కోరారు. ఆయనకు మద్దతిచ్చిన కౌన్సిలర్లలో బీజేపీ కౌన్సిలర్ బొప్పారపు సత్యవతి చెయ్యి ఎత్తే విషయంలో గందరగోళం చోటుచేసుకుంది. చైర్మెన్ అభ్యర్థి సత్యం ఆమె చేయి ఎత్తారని ఆందోళనకు దిగడంతో గందరగోళం ఏర్పడింది. ఆమె మాత్రం తాను చేయి ఎత్తలేదంటూ ఈ క్రమంలో ఒత్తిడికి గురై స్పృహ కోల్పోయారు. మున్సిపల్ కార్యాలయంలో గొడవ జరుగుతుందని తెలుసుకున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్, బీజేపీ నాయకులు రితీష్ రాథోడ్ తమ అనుచరులతో లోనికి వెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు అడ్డుపడటంతో వారిని తోసేసి వంద మీటర్ల పరిధి దాటే ప్రయత్నం చేయగా పోలీసులు లాఠీచార్జి చేశారు. అనంతరం రెండు గంటలపాటు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఆందోళన తీవ్ర కావడంతో ఎన్నికను వాయిదా వేస్తునట్టు ఎన్నికల అధికారి జీవరత్నం ప్రకటించారు.

**ఇబ్రహీంపట్నం చైర్మెన్‌గా సుదర్శన్‌రెడ్డి ఎన్నిక నుంచి కాంగ్రెస్ వాకౌట్**

భారీ పోలీస్ బందోబస్తు, ఆంక్షలు, ఉత్కంఠ భరిత పరిణామాల మధ్య జరిగిన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ పీఠం చివరకు బీఅర్ఎస్ కైవసం చేసుకుంది. చైర్మెన్‌గా టేకుల సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్‌గా బీజేపీకి చెందిన ముత్యాల శ్యామల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికను కాంగ్రెస్ బహిష్కరించింది. శనివారం ఉదయం నుంచే ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం వద్ద ఉత్కంఠ వాతావరణం ఏర్పడింది. సుమారు 800 మంది పోలీసులతో ఇనుప కంచెలు వేసి, 144 సెక్షన్ విధించిన నేపథ్యంలో కౌన్సిలర్లు పార్టీల వారీగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు.

24 మంది కౌన్సిలర్లతో పాటు ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. స్పష్టమైన కోరం ఉండటంతో ప్రిసైడింగ్ అధికారిగా జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ పర్యవేక్షణలో ఎన్నిక నిర్వహించారు.

# దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదు

### సీట్లు కోల్పోతామన్న వాదనలో అర్థం లేదు

### కేరళ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ



**తిరువనంతపురం ఏప్రిల్ 4 (జర్నలిస్ట్ వార్త):** జనాభా నియంత్రణతో దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభ స్థానాలు కోల్పోతాయంటూ చేస్తున్న వాదనల్లో నిజం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. కొందరు కావాలనే ఈ వాదనను తెరపైకి తెచ్చారని అన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ అధికారంలోకి వస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఎల్డీఎఫ్ ఉద్వాసనకు కౌంట్‌డౌన్ మొదలైందని చెప్పారు. తిరువళ్లలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోదీ మాట్లాడుతూ, కేరళ అభివృద్ధిపై కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి ఎన్నడూ దృష్టి పెట్టలేదని, 2004-2014 మధ్య కేరళ అభివృద్ధికి అప్పటి కేంద్రలోని యూపీఏ ప్రభుత్వం కేటాయించిన మొత్తం కంటే తమ ప్రభుత్వం ఎక్కువ కేటాయించిందని చెప్పారు. 'ఇంతకుముందు కూడా ఇక్కడకు వచ్చాను. కానీ ఈసారి అన్నివైపుల నుంచి మార్పు కోరుతున్న బలమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. కేరళలో అతిపెద్ద మార్పు రాబోతోంది. తొలిసారి బీజేపీ-ఎన్డీయే ప్రభుత్వం కేరళలో అధికారంలోకి రాబోతోంది' అని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఎల్డీఎఫ్-యూడీఎఫ్ ప్రభుత్వాలు ఎప్పుడూ ఈ ప్రాంతం గురించి పట్టించుకోలేదని, రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, చాలా ఏళ్లుగా ఒక్క ప్రధాన బ్రిడ్జి కూడా నిర్మించ లేదని, మెడికల్ కాలేజీ పరిస్థితి దయనీయంగా ఉందని విమర్శించారు. కనీస మౌలిక సదుపాయాలు లేకుండా జీవన ప్రమాణాలు ఏ స్థాయిలో ఉంటాయనేది ఎవరైనా ఊహించవచ్చని అన్నారు. ఎన్డీయే విధానాలతో ప్రతి ఒక్క వర్గానికి, ముఖ్యంగా మహిళలు ఎంతో లబ్ది పొందుతున్నారని ప్రధాని అన్నారు. వలస కార్మికులకు ఉద్యోగాలు కల్పన కేరళలో అతిపెద్ద సమస్యగా ఉందని, బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, ఇది మోదీ ఇచ్చే హామీ అని ప్రధాని భరోసా ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాలు, గోవా తరహాలోనే కేరళను అభివృద్ధి చేస్తామని అన్నారు. శబరి రైల్వే ప్రాజెక్టు నిలిచిపోవడానికి ఎల్‌డీఎఫ్ కారణమని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని అడ్డంకులూ తొలగిపోతాయని భరోసా ఇచ్చారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఈశాన్య రాష్టాల్లో మాదిరిగా అభివృద్ధి ప్రాజెక్టులు చేపడతామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డ ఆయన.. పశ్చిమాసియా అంశంపై భయాన్ని సృష్టించే వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. కేరళలో శబరిమల రైల్వే ప్రాజెక్టు కొత్త అవకాశాలను తీసుకురాగలదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇది శబరిమలకు ప్రత్యక్ష అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని.. స్థానిక వ్యాపారాలకు కొత్త ఊపునిస్తుందని చెప్పారు. యువతకు కొత్త ఉపాధి మార్గాలను తెరుస్తుందని వివరించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అసంపూర్తిగా వదిలేసిందని విమర్శించారు. భాజపా డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇలాంటి అడ్డంకులన్నీ తొలగిపోతాయన్నారు.కాగా, కేరళ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న ఒకే విడతలో జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# అమరావతిపై తీర్మానం శాశ్వతం కాదు

మొదటిపేజీ తరువాయి

పనులు వేగంగా పూర్తి చేయాలి. సీఎం చంద్రబాబు అమరావతిని జాప్యం చేస్తే మేం ఇంకో ఆలోచన చేస్తాం అని బొత్స అన్నారు.రాష్ట్రంలో రైతులు, విద్యార్థులు, సామాన్య ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ, అమరావతి అంశం చుట్టూనే ప్రభుత్వం, మీడియా తిరుగుతోందని బొత్స విమర్శించారు. ప్రజల అసలు సమస్యలను పక్కన పెట్టి ఒకే అంశంపై దృష్టి సారించడం దురదృష్టకరమని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, మామిడి పండ్లలో కూడా కల్తీ జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి నిర్మాణం విషయానికి వస్తే, గతంలో టీడీపీ ప్రభుత్వంలో కేవలం 5 శాతం పనులే పూర్తయ్యాయని బొత్స పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటిపోయినా పనులు ఎందుకు ముందుకు సాగడం లేదని ప్రశ్నించారు. ఇప్పటివరకు అమరావతిపై ఎంత ఖర్చు చేశారు, ఎంత ఫిజికల్‌గా పనులు జరిగాయి, ఎంత మొత్తాన్ని అడ్వాన్స్‌లుగా ఇచ్చారు అనే వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. అమరావతి నిర్మాణ వ్యయం మొదట లక్ష 16 వేల కోట్లుగా అంచనా వేయగా, ఇప్పుడు అది రెండు లక్షల కోట్లకు పెరిగిందని ఆయన చెప్పారు. నిర్మాణ వ్యయాల్లో భారీ పెరుగుదలపై కూడా స్పష్టత ఇవ్వాలని కోరారు. అలాగే అమరావతిలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, న్యాయమూర్తులు, ప్రభుత్వ ఉద్యోగుల కోసం నిర్మించిన భవనాలను పూర్తి చేసి ఎందుకు కేటాయింపులు చేయలేదని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా అంశాన్ని కూడా ప్రస్తావిస్తూ, పార్లమెంట్‌లో అమరావతిపై చూపిన శ్రద్ధను ప్రత్యేక హోదా సాధనపై ఎందుకు చూపలేదని ప్రశ్నించారు బొత్స. ప్రత్యేక హోదా వస్తే ముంబై స్థాయి నగరాలు, అనేక అభివృద్ధి కేంద్రాలు రాష్ట్రంలో ఏర్పడే అవకాశముందని అన్నారు. అమరావతిని ఆపేయాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎక్కడా చెప్పలేదని స్పష్టం చేసిన బొత్స, ప్రభుత్వం ముందుగా నిర్మాణ పనులను పూర్తి చేసి తరువాతే ప్రకటనలు చేయాలని సూచించారు. కేవలం పేర్లు పెట్టడం లేదా ప్రకటనలు చేయడం ద్వారా అభివృద్ధి సాధ్యం కాదని విమర్శించారు. మొత్తంగా అమరావతి అంశంలో రాజకీయ విమర్శలు ముదురుతున్న నేపథ్యంలో, బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీసే అవకాశముంది.

# అణిచివేత, అప్రజాస్వామిక చర్యలకు రాష్ట్రంలో చోటు లేదు

**హైదరాబాద్, ఏప్రిల్ 4 (జర్నలిస్ట్ వార్త):**

క్యాతనపల్లి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ పీఠాలు బీఆర్ఎస్ కైవసం చేసుకోవడం ప్రజాస్వామ్య జయకేతనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని కాంగ్రెస్ ఎన్ని అరాచకాలు చేసినా ఆ స్థానాలను బీఆర్ఎస్ దక్కించుకుందని అన్నారు. ఇది హర్షణీయమని పేర్కొన్నారు. అణిచివేత, అప్రజాస్వామిక చర్యలకు రాష్ట్రంలో చోటులేదని ఈ తీర్పు స్పష్టం చేసిందని తెలిపారు.

విజయం సాధించిన ఆయా మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లకు కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ గెలుపు కోసం కృషి చేసిన బాల్క సుమన్, మంచిరెడ్డి కిషన్ రెడ్డి తదితరులకు ఆయన అభినందనలు తెలియజేశారు."అడ్డదారుల్లో ఈ స్థానాలను కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఎన్ని రకాల ప్రలోభాలు పెట్టినా, రకరకాలుగా ఒత్తిళ్లు తెచ్చినా వేటికి లొంగకుండా మొక్కవోని దీక్షతో ఒక్క తాటిపై నిలిచిన కౌన్సిలర్లకు ప్రత్యేకంగా సెల్యూట్ చేస్తున్నా. క్యాతనపల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకునేందుకు మిత్రపక్షమైన సీపీఐ కామ్రేడ్లు అడుగడుగునా కనబరిచిన పోరాట పటిమ ఎంతో స్ఫూర్తిదాయకం" అన్నారు.అణచివేతకు, బెదిరింపులకు, అవినీతి అక్రమాలకు, అప్రజాస్వామిక చర్యలకు తెలంగాణలో తావులేదని ఈ తీర్పు తేల్చి చెప్పిందని పేర్కొన్నారు. రెండున్నరేళ్లలోనే పీకల్లోతు ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో కౌంట్ డౌన్ మొదలైందని ఈ ఫలితాలు నలుదిశలా చాటి చెప్పాయని అన్నారు.

అటు పంచాయతీ, ఇటు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ముచ్చెమటలు పట్టించిన గులాబీ జెండా సైనికులను పార్టీ ఎప్పటికీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ విజయాలు అందించిన స్ఫూర్తిని కొనసాగిద్దామని, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను అడుగడుగున ధ్వంసం చేస్తున్న రేవంత్ సర్కారుకు బుద్ధి చెబుదామని పిలుపునిచ్చారు.

## సింగరేణి కార్మికులకు శుభవార్త

### సహజరణానికి కూడా పదిలక్షల బీమా

**హైదరాబాద్, ఏప్రిల్ 4 (జర్నలిస్ట్ వార్త):** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కార్మికుల సంక్షేమం దిశగా మరో కీలక అడుగు పడింది. సింగరేణి యాజమాన్యం తీసుకున్న ప్రత్యేక చొరవతో, కార్మికులకు లభించే బీమా సౌకర్యం ఇప్పుడు మరింత విస్తృతమైంది. ఇకపై ప్రమాదవశాత్తు జరిగే మరణాలకే కాకుండా, సహజ మరణానికి కూడా రూ. 10 లక్షల ఉచిత బీమా పథకాన్ని అమలు చేయాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. సాధారణంగా బ్యాంకులు ప్రమాద బీమాను మాత్రమే అందిస్తుంటాయి. అయితే, సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం యూనియన్ బ్యాంక్ అధికారులతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. కార్మికులందరికీ జీతాల ఖాతాలు అదే బ్యాంకులో ఉండటంతో, సామాజిక బాధ్యతలో భాగంగా ఈ అదనపు ప్రయోజనాన్ని కల్పించేందుకు బ్యాంక్ అంగీకరించింది.సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఇది వర్తిస్తుంది. ఈ నూతన బీమా విధానం ఈ నెల 1వ తేదీ నుండే అమలులోకి వచ్చింది. దీని కోసం కార్మికులు ఎటువంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. ఇది పూర్తిగా ఉచితంగా అందించే సేవ. సింగరేణి వంటి కష్టతరమైన వృత్తిలో ఉన్న కార్మికులకు ఈ పథకం పెద్ద అండగా నిలవనుంది. విధి నిర్వహణలో కాకుండా, ఇంటి వద్ద సహజంగా మరణించినా వారి కుటుంబాలకు ఈ 10 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందుతుంది. ఇది కార్మిక కుటుంబాల్లో భరోసాను నింపుతోంది. సింగరేణి చరిత్రలో ఇలా సహజ మరణానికి కూడా భారీ మొత్తంలో బీమా వర్తించడం ఇదే తొలిసారి అని కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. యాజమాన్యం , యూనియన్ బ్యాంక్ తీసుకున్న ఈ నిర్ణయంపై కార్మికుల నుండి ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# ప్రళయానికి 48 గంటలే

మొదటిపేజీ తరువాయి

కొనసాగుతున్న తరుణంలో ఈ హెచ్చరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇప్పటికే ఇరాన్ చర్యల వల్ల హర్మూజ్ జలసంధిలో చమురు రవాణాకు ఆటంకాలు ఏర్పడ్డాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా గ్యాస్ ధరలు పెరిగాయి."ఇక ఆలస్యం కాకముందే ఓ ఒప్పందానికి రండి" అంటూ ట్రంప్ ఇరాన్‌కు సూచించారు. యుద్ధం నాలుగో వారానికి చేరిన నేపథ్యంలో, అవసరమైతే ఇరాన్‌లోని పవర్ ప్లాంట్లపై కూడా దాడి చేస్తామని ట్రంప్ గతంలో బెదిరించారు. అంతేకాకుండా, హర్మూజ్ జలసంధి భద్రత బాధ్యతను అమెరికా తీసుకోదని, చమురు అవసరమైన దేశాలు తమ నౌకలను తామే రక్షించుకోవాలని లేదా అమెరికా నుంచి చమురు కొనుగోలు చేయాలని ఆయన స్పష్టం చేశారు.ట్రంప్ హెచ్చరికలతో అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. యుద్ధం కారణంగా ఇప్పటికే దెబ్బతిన్న ఇరాన్ చమురు ఎగుమతులపై ఈ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు

# ఆధ్యాత్మికత ఉట్టిపడేలా

మొదటిపేజీ తరువాయి

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రహదారులు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆలయ పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఈవీ వాహనాలనే అనుమతించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని స్పష్టం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఆలయ పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నియంత్రణలు ఉండాలని సీఎం పేర్కొన్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ, ఆలయాన్ని అభివృద్ధి చేసే దిశగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశంచేశారు. బాసర ఆలయ అభివృద్ధిపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరించారు. మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం. ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను, రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని ఆదేశించారు. తిరుమల తరహాలో అన్ని ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నిబంధనలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశానికి మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ నెల 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. రూ.225 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

# కెసిఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి

## రేవంత్ ఆదేశాలతోనే దాడికి వ్యూహం

### తీవ్రంగా ఖండించిన హరీష్ రావు

**హైదరాబాద్, ఏప్రిల్ 4 (జర్నలిస్ట్ వార్త):** ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ గూండాల దాడిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు తీవ్రంగా ఖండించారు. ఇది ముమ్మాటికీ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో జరిగిన దాడి అని, ప్రజాస్వామ్యం పై సీఎం చేయించిన దాడి అని ఆరోపించారు. పట్టపగలు అధికార మదంతో విర్రవీగుతూ సోయి మరచి వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరు బీహార్ గ్యాంగ్‌ను తలపిస్తోందని మండిపడ్డారు.ఏకంగా ప్రజా ప్రతినిధుల క్యాంపు కార్యాలయాల పైనే ముప్పేట దాడులు చేస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నట్లా లేనట్లా?. కాంగ్రెస్ పాలనలో ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు, మీడియాపై దాడులు నిత్యకృత్యం కావడం సిగ్గుచేటని అన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం కాంగ్రెస్ పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారిపోయారా? ఎందుకు అడ్డుకోవడం లేదంటూ ప్రశ్నించారు. ఒకవైపు ' హేట్ స్పీచ్ బిల్ ' పేరుతో ప్రజలు, ప్రతిపక్షాల నోళ్లు మూయిస్తూ, మరోవైపు కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించడమేనా మీ ప్రజా పాలన? అంటూ నిలదీశారు. ఇందిరమ్మ రాజ్యమని చెబుతూ గూండా రాజ్యం అమలు చేస్తారా? అని అన్నారు . సీఎం, మంత్రులు ఇతర రాష్టాల్లో పొలిటికల్ టూర్లు చేస్తూ పాలనను గాలికి వదిలేసారని విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఉంటే, ఇక్కడ పాలనను ఎవరు చూస్తారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కార్యాలయాలపై దాడులు చేయాలని సందేశాలు ఇచ్చారా? కాంగ్రెస్ నాయకులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారా? అంటూ అనుమానం వ్యక్తం చేశారు. ఏడవ గ్యారంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని డబ్బా కొట్టి ఇప్పుడు, ఉన్న ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. ఎమర్జెన్సీ పాలనను తలపిస్తున్నారు. మీ అణచివేతలకు, నిర్బంధాలకు, దాడులకు బీఆర్ఎస్ పార్టీ అదరదు, బెదరదని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్‌ను అడుగడుగునా నిలదీస్తూనే ఉంటాం, ప్రజల తరపున పోరాటం చేస్తూనే ఉంటామని వివరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడులు జరిపిన కాంగ్రెస్ గూండాలను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర డీజీపీకి డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు ఆపకపోతే ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలే వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి వస్తుందని, తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు.

# 5 కేజీల గ్యాస్ సిలిండర్లకు అడ్రస్ ప్రూఫ్ అవసరం లేదు: కేంద్రం

పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఇకపై 5 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌ను అడ్రస్ ప్రూఫ్ అవసరం లేకుండా, కేవలం ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చని శనివారం స్పష్టం చేసింది. సమీపంలోని ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల వద్ద ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఇంధన సరఫరాపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని, అయితే దేశంలో పెట్రోల్, డీజిల్ లేదా ఎల్పీజీకి ఎలాంటి కొరత లేదని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ప్రజలు ఆందోళన చెంది ఇంధనాన్ని అధికంగా కొనుగోలు చేయవద్దని విజ్ఞప్తి చేసింది. దేశవ్యాప్తంగా అన్ని రిటైల్ ఔట్‌లెట్లు సాధారణంగా పనిచేస్తున్నాయని, తగినన్ని నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది.

ముఖ్యంగా వలస కార్మికులు, స్థానిక చిరునామా పత్రాలు లేని వారిని దృష్టిలో ఉంచుకుని 5 కేజీల సిలిండర్ నిబంధనను సరళతరం చేసినట్లు అధికారులు వివరించారు. మార్చి 23 నుంచి ఇప్పటివరకు సుమారు 5.7 లక్షల సిలిండర్లను ఈ పద్ధతిలో విక్రయించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

ఇంధన సరఫరాలో స్థిరత్వాన్ని కొనసాగించడానికి దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని పెంచామని, రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని కేంద్రం తెలిపింది. మరోవైపు, అక్రమ నిల్వలు, నల్ల బజారును అరికట్టేందుకు నిఘా పెంచామని, ఇటీవల 3,700కు పైగా దాడులు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన డిస్ట్రిబ్యూటర్లపై కఠిన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. నిత్యావసర వస్తువుల చట్టం కింద చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించినట్లు పేర్కొంది.

# కేంద్ర మంత్రి కుమారస్వామికి అండగా ఉండాలి

మొదటిపేజీ తరువాయి



కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామికి మనమందరం అండగా నిలవాలని ఏపీ ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కుమారస్వామి కాపాడారని, ఆయన కేంద్ర మంత్రిగా ఉండటం మన అదృష్టమని లోకేశ్ అన్నారు. కుమారస్వామికి ఎప్పుడూ మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.కర్ణాటకలోని సింధనూరు హోసల్లీ క్యాంపులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్‌ను శనివారం లోకేశ్ ప్రారంభించారు. కేంద్ర మంత్రి కుమారస్వామి, కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌తో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేశ్ ప్రసంగించారు.కర్ణాటక సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని ఆయన కొనియాడారు. దేశం కోసం సైనికులు చేస్తున్న ప్రాణత్యాగాలను ఎప్పటికీ మర్చిపోకూడదని అన్నారు. రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు.

## ముల్కనూర్ పీహెచ్‌సీలో హెచ్‌పీవీ టీకా ప్రారంభం

### గ్రామీణ మహిళల ఆరోగ్య రక్షణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్



**భీమదేవరపల్లి/ఏప్రిల్4 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 4వ తేదీ శనివారం నుంచి హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చినట్లు వైద్యాధికారి డాక్టర్ జోత్స్న తెలిపారు. మహిళల్లో ప్రధానంగా కనిపించే సర్వికల్ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను నివారించడంలో ఈ టీకా కీలక పాత్ర పోషిస్తుందని ఆమె వివరించారు.

హెచ్‌పీవీ వైరస్ కారణంగా సర్వికల్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉండటంతో, ముందస్తు జాగ్రత్తగా ఈ టీకా తీసుకోవడం ఎంతో అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా యుక్తవయస్సు బాలికలు, యువతులు ఈ టీకాను తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో వచ్చే ఆరోగ్య సమస్యలను నివారించుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ముల్కనూర్ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జోత్స్న మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆరోగ్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన బాలికలు, మహిళలు తమకు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి టీకా వేయించుకోవాలని సూచించారు. టీకా గురించి ఎటువంటి అపోహలు పెట్టుకోకుండా వైద్యుల సలహా మేరకు ముందుకు రావాలని ఆమె తెలిపారు.

## అంబేద్కర్ కూడలిలో దళిత హక్కుల పోరాట సమితి పత్రిక ఆవిష్కరణ




**హనుమకొండ, బ్యూరో ఏప్రిల్ 4 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా కాజీపేట మండలం రాంపూర్ గ్రామంలోని అంబేద్కర్ కూడలిలో దళిత హక్కుల పోరాట సమితి పత్రికను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సమితి ఖజాంచి వక్కల ప్రతిభ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా సమితి అధ్యక్షుడు రాజారపు రత్నం హాజరై మాట్లాడుతూ, తరతరాలుగా అణచివేత, అంటరానితనం, వివక్ష, దోపిడీకి గురవుతున్న అట్టడుగు వర్గాల అభ్యున్నతే సమితి లక్ష్యమని తెలిపారు. దళితులు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అన్యాయాలను ప్రశ్నిస్తూ, సమానత్వ సాధన కోసం సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.
తెలంగాణ రాష్ట్ర రెండవ మహాసభలు ఏప్రిల్ 17, 18 తేదీలలో వరంగల్‌లోని అభ్యున్నతి సభాభవనంలో నిర్వహించనున్నట్లు తెలియజేస్తూ, కాజీపేట మండలం నుంచి అధిక సంఖ్యలో హాజరై సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప కార్యదర్శి మేకల శంకర్, బుడిగ కమలాకర్, ఏం రాజు, శంకర్ నాయక్, మునిగాల బిక్షపతి, దర్శనాల గోపి, ఏం రమేష్, లక్ష్మి, మనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆపిల్ ఫార్మసీ ప్రారంభం





**వేలేరు/హనుమకొండ బ్యూరో, ఏప్రిల్ 4: (జర్నలిస్ట్ వార్త);** మండల కేంద్రంలో వైద్య సేవలు మరింత చేరువయ్యాయి. అంబేద్కర్ విగ్రహం సమీపంలో ప్రొ. భూక్య రాజుకు చెందిన 'ఆపిల్ ఫార్మసీ' మెడికల్ డ్రగ్గిస్టు సెంటర్‌ను శనివారం ఘనంగా ప్రారంభించారు. శాలపల్లి సర్పంచ్ కూరపాటి అశోక్, లోక్యతండ సర్పంచ్ మురావత్ సాంబయ్యలు టెంకాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు భూక్య రాజు మాట్లాడుతూ నిరుపేదలకు నాణ్యమైన మందులు, అవసరమైన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాయిత మాధవరెడ్డి, మురావత్ లక్ష్మణ్ నాయక్, మురావత్ రాజు, లింగయ్య రాజు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కుర్నవల్లిలో ఉచిత హోమియో శిబిరం విజయవంతం

**తల్లాడ/ ఏప్రిల్ 4 (జర్నలిస్ట్ వార్త):**
మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామంలో మాస్టర్ ఈకే ఆధ్యాత్మిక సేవా సంస్థ, ఖమ్మం శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరం విజయవంతమైంది. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలు పొందారు. ఈ శిబిరంలో ప్రముఖ హోమియో వైద్య నిపుణులు దీకొండ రాములు, రాఘవన్, శాస్త్రి, వెంకన్న, రవికుమార్, మాధవరావు పాల్గొని రోగులను పరీక్షించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శేషమ్మ, గ్రామ పెద్దలు ఐలూరి వెంకట కోటారెడ్డి (బాబురెడ్డి), ఐలూరి శివారెడ్డి, గంటల వెంకటాచారి, ఉప సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.





# ఆడపిల్లలను రక్షించుకుందాం

## దేశ భవిష్యత్తును బలపర్చుకుందాం: డా. అప్పయ్య

**వేలేరు/హనుమకొండ బ్యూరో, ఏప్రిల్ 4: (జర్నలిస్ట్ వార్త)** ఆరోగ్యవంతమైన మహిళలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అప్పయ్య అన్నారు. జాతీయ హెచ్‌పీవీ టీకా కార్యక్రమంలో భాగంగా గర్భాశయ క్యాన్సర్‌కు కారణమయ్యే హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్‌పీవీ) నుంచి రక్షణ కల్పించే టీకా అత్యంత సురక్షితమైందని తెలిపారు. శనివారం మండలంలోని గొల్లకిష్టంపల్లి గ్రామశివారులోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్రవంతి ఆధ్వర్యంలో, వేలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. నవీన్‌కుమార్ సిబ్బందితో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డా. అప్పయ్య



మాట్లాడుతూ 1415 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ టీకా ఎంతో ప్రయోజనకరమని, గర్భాశయ క్యాన్సర్‌తో పాటు యోని, వల్వర్, గొంతు క్యాన్సర్ల నుంచి రక్షణ కల్పిస్తుందని వివరించారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్సకన్నా ముందుగానే నివారణ మంచిదని సూచించారు. సోమవారం నుంచి వేలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌పీవీ టీకా అందుబాటులో



ఉంటుందని, అర్హులైన బాలికలకు తప్పనిసరిగా టీకా వేయించాలని తల్లిదండ్రులను కోరారు.
కార్యక్రమంలో కెజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కె. స్రవంతి, పీహెచ్‌సీ వైద్యాధికారి డా. నవీన్‌కుమార్, ఫార్మసిస్టు అనిత, హెచ్‌వీ ప్రభావతి, గ్రామ సర్పంచ్ బత్తుల శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# పోలీస్ స్టేషన్‌లో పాఠాలు నేర్చుకున్న విద్యార్థులు







**రాయపర్తి,/ ఏప్రిల్ 4: (జర్నలిస్ట్ వార్త)**
పుస్తకాలకే పరిమితమైన పాఠాలు కాకుండా ప్రాయోగిక అవగాహన కల్పించే దిశగా కొండూరు పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముందడుగు వేశారు. సాంఘిక శాస్త్ర ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా హెచ్‌ఎం పద్మలత ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌తో పాటు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను సందర్శించారు. పోలీస్ స్టేషన్‌లో అధికారులతో ముఖాముఖి మాట్లాడిన విద్యార్థులు కేసుల నమోదు విధానం, ఎఫ్ఐఆర్, చార్జ్‌షీట్ ప్రక్రియలపై అవగాహన పొందారు. పోలీసులు ఎలా పనిచేస్తారు? ప్రజల ఫిర్యాదులను ఎలా పరిష్కరిస్తారు? అనే అంశాలను ఆసక్తిగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ ముత్యం రాజేందర్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్యపై దృష్టి సారించాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా 100 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, డ్రగ్స్ వంటి ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయిని యాకన్న, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు కేసాజు సత్యనారాయణ, ఫిజికల్ సైన్స్ టీచర్ కటకం రఘు తదితరులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ఇద్‌మిలాప్ వేదిక





**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 4 (జర్నలిస్ట్ వార్త):**
మతాలు మనుషులను విడదీయడానికి కాకుండా మనసులను కలపడానికి అన్న సందేశాన్ని చాటుతూ ధర్మసాగర్ మండలంలో ఉపాధ్యాయులు నిర్వహించిన ఇద్‌మిలాప్ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగింది. ఇగ్నైటెడ్ మైండ్స్ ఫ్యామిలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పిండియాల్ స్టేషన్‌లోని అంకం సంపత్ నివాసంలో ఈ స్నేహసమ్మేళనం నిర్వహించారు. జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల గెజిటెడ్ హెడ్‌మాస్టర్ మురళి అధ్యక్షత వహించగా, ధర్మసాగర్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ ధర్మప్రకాశ్ సమన్వయకర్తగా వ్యవహరించారు. పూర్వంలో మండలంలో సేవలందించిన పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు గఫ్ఫార్, అబ్దుల్ అలీమ్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ, రంజాన్ మాసం కేవలం ఉపవాసాలకు మాత్రమే పరిమితం కాకుండా ఆత్మశుద్ధి, సహనం, సేవాభావం, మానవతా విలువలను ఆచరణలో పెట్టే పవిత్ర కాలమని పేర్కొన్నారు. ఇలాంటి సమావేశాలు మత సామరస్యాన్ని బలపరచడంతో పాటు పరస్పర గౌరవాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.
గఫ్ఫార్ మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు సఖ్యత, శాంతి, మానవీయ విలువలను పెంపొందిస్తాయని, పరస్పర అనుబంధాలను బలోపేతం చేస్తాయని అన్నారు. అబ్దుల్ అలీమ్ మాట్లాడుతూ, వివిధ మతాలకు చెందిన ప్రజలు ఒకే వేదికపై కలిసినప్పుడు మానవత్వమే అన్ని భేదాలకు మించి ఉంటుందని గుర్తుచేశారు. కార్యక్రమం మొత్తం స్నేహస్ఫూర్తి, మత సామరస్యం, భారతీయ సెక్యులర్ సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ సాగింది. లాజిస్టిక్, ఆతిథ్య ఏర్పాట్లను సర్వర్, రంజాన్, అష్రఫ్ సమర్థంగా నిర్వహించారు. టీఈ కార్యక్రమంలో వీరరాఘవ్, జగన్ మోహన్, ఖసందీప్, జగదీశ్వర్, సదానందీశ్వర్, రవి కుమార్, సతీష్ బాబు, మధు, మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# మక్క రైతుల కోసం కొనుగోలు కేంద్రాలు

## గిట్టుబాటు ధరే లక్ష్యం: కడియం శ్రీహరి





**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోఏప్రిల్ 4 (జర్నలిస్ట్ వార్త) :** మక్క రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. మక్కలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఉన్నప్పటికీ వ్యాపారస్తుల కుమ్మక్కుతో తక్కువ ధరలకు కొనుగోలు జరుగుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించగా ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలోనే తొలి మక్కల కొనుగోలు కేంద్రాన్ని స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ప్రారంభించిందని తెలిపారు. రైతుల సౌకర్యార్థం ధర్మసాగర్, రఘునాథపల్లి మండలాల్లో మరిన్ని కేంద్రాలకు అనుమతులు తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధరకు మక్కలు విక్రయించుకోవాలని సూచించారు. అమ్మిన మక్కలకు 10 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. వ్యవసాయంలో కూలీల కొరత దృష్ట్యా యాంత్రికరణ వైపు రైతులు అడుగులు వేయాలని సూచిస్తూ, సబ్సిడీపై అందిస్తున్న డ్రోన్లు, బేలర్స్ వంటి పరికరాలను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేశారు. అలాగే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద లబ్ధిదారులకు చెక్కులు, ముఖ్యమంత్రి సహాయ నిధి కింద పలువురికి ఆర్థిక సహాయం అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ అనేక పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్, సన్న బియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరుతోందని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి అందరూ సహకరించాలని, నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలపాలని ఆయన పిలుపునిచ్చారు.



# గజ్వేల్‌లో బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి ఖండనీయం: నూనె హరిబాబు



**వేంసూర్/ఏప్రిల్ 4(జర్నలిస్ట్ వార్త):** గజ్వేల్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వేంసూర్ బీఆర్ఎస్ నాయకుడు నూనె హరిబాబు తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, రాష్ట్ర ఉద్యమానికి నాయకత్వం వహించిన కల్వకుంట్ల చంద్రశేఖర రావు కార్యాలయంపై దాడి జరగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అహర్నిశలు శ్రమించిన మహానేత కార్యాలయంపై దుండగులు దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ కక్షసాధింపుల కోసం ఇలాంటి ఘటనలకు పాల్పడటం సమంజసం కాదన్నారు. ఈ ఘటన వెనుక ఉన్న బాధ్యులను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న కేసీఆర్‌పై అభిమానాన్ని తగ్గించలేరని, తెలంగాణ ప్రజలు ఎల్లప్పుడూ తమ నాయకుడికి అండగా నిలుస్తారని నూనె హరిబాబు స్పష్టం చేశారు.

# అంకమ్మ జాతరలో వైభవంగా పూజలు అన్నదానానికి శ్రీకారం




**తల్లాడ/, ఏప్రిల్ 4 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలోని అంకమ్మ మహాలక్ష్మమ్మ, మద్దిరావమ్మ జాతర సందర్భంగా శనివారం భక్తి శ్రద్ధల మధ్య ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. వైరా లయన్స్ క్లబ్ ఫస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్, ప్రముఖ వైద్యులు డాక్టర్ కాపా మురళీకృష్ణ పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. తల్లాడ మాజీ ఎంపీపీ, ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డాక్టర్ కాపా మురళీకృష్ణకు ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. పూజారులు నిర్వహించిన ప్రత్యేక పూజల అనంతరం ఆయన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాతరలో మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకొని అమ్మవార్లకు సమర్పించడం విశేషంగా నిలిచింది. గ్రామ మాజీ సర్పంచ్ దొడ్డా నిర్మల కూడా బోనాల కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ ప్రజలంతా పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దొడ్డ చిన్న శ్రీనివాసరావు, మారెళ్ళ దేవేందర్ రావు, తుమ్మలపల్లి వెంకటయ్య, దుగ్గినేని సత్యమయ్య, దొడ్డ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# పథకాలు దేశానికే ఆదర్శంగా

### ... స్టేషన్ ఘన సంక్షేమపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్ ఘన్పూర్ /ఏప్రిల్ 4 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తు న్నాయని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. చిల్పూర్ మండల కేంద్రంలోని వరలక్ష్మి గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబా రక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా చిల్పూర్ మండలానికి సంబందించిన 40మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు 40లక్షల 04వేల 640రూపాయల విలువగల చెక్కులను మరియు 41మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారు లకు 12లక్షల 74వేల రూపాయల విలువగల చెక్కులను పంపిణి చేశారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 8లక్షల కోట్లకు వాయిదాలు, మిత్తిలు చెల్లిస్తూ కూడా పేద వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వ సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే కొత్త పథకాలను అమలు చెస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 2సంవత్సరాల కాలంలో ప్రవేశ పెట్టిన ప్రతీ పథకాల ద్వారా రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వెల్లడించారు. ఈ నియోజక వర్గంలోని ఏ గ్రామానికి వెళ్లిన పదుల సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. కల్వకుంట్ల కుటుంబానికి 2014కు ముందు ఉన్న ఆస్తులు ఎన్ని ఇప్పుడు ఉన్న ఆస్తులు ఎన్నో చెప్పమంటే ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ వనరులు దోచుకొని ఆస్తులు కూడబెట్టుకున్నారని ఆరోపించారు. ఇవాళ వాళ్లే సుద్దపూసల లెక్క మాట్లాడుతున్నారని ఏద్దేవా చేశారు. వెల్లడించారు. అలాగే తెలంగాణ తిరుప తిగా పేరుగాంచిన శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికీ మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేస్తున్నట్లు దీనిపై త్వరలోనే దేవాదాయ శాఖ కమిషనర్ తో సమావేశం ఏర్పాటు చేయనున్న ట్లు తెలిపారు. ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్న ప్పటికీ కూడా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధికి 1400 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి నియోజకవర్గ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు. చేసు కుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, తహసీల్దార్, ఎంపిడివో, సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్త లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# నూతన వధూవరులకు ఎర్రబెల్లి ఆశీర్వాదం



**రాయపర్తి/ఏప్రిల్ 4(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని గణేష్ కుంట తండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మునావత్ స్వామి కుమార్తె మధులత - మణితేజ వివాహ వేడుకలో శనివారం మాజీ మంత్రి,పాలకుర్తి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొని నూతన వదూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహా నాయక్,మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్,పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు,గజవెల్లి ప్రసాద్, సంకినేని ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి అండగా బీఆర్ఎస్



**రాయపర్తి, /ఏప్రిల్ 4:( జర్నలిస్ట్ వార్త)** అనారోగ్యంతో మృతి చెందిన ఎనగందుల రాములు కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు అండగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన రాములు ఇటీవల కన్నుమూయగా, శనివారం లేతాకుల రంగా రెడ్డి ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.
ఈ సందర్భంగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా 50 కేజీల బియ్యం, ఆయిల్ క్యాన్‌ను అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి తోడుగా ఉంటామని నాయకులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఐత రామ్ చందర్, గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి చందు రాము, మండల యూత్ ప్రధాన కార్యదర్శి సంకినేని ఎల్లస్వామి, వార్డు సభ్యులు కుంట రాంబాబు, గారే యాకయ్య, గారే కళ్యాణి విష్ణు, ఎనగందుల యాదగిరి, ఐత కుమార్, గుడ్ల గురునాథం, ఐత రవి, బల్లెం యాదగిరి, ఐత సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏసీపీ సారంగపాణికి ఘన సన్మానం



**తల్లాడ,/ ఏప్రిల్ 4 (జర్నలిస్ట్ వార్త):** వైరా ఏసీపీ సారంగపాణిని తల్లాడకు చెందిన వ్యాపారవేత్త, మట్టమ్మ హోటల్ అధినేత సరికొండ అప్పలరాజు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. వైరాలోని ఏసీపీ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. గతంలో తల్లాడ పోలీస్ సబ్ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన సారంగపాణితో అప్పలరాజు కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. ప్రాంత పరిస్థితులు, పోలీసు వ్యవస్థపై చర్చించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, ఏసీపీని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించడం ఆనందంగా ఉందన్నారు.

# ఎఫ్‌సీఐ గోదాం భూమి కాపాడాలని డిమాండ్



**రాయపర్తి,/ ఏప్రిల్ 4 (జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని వరంగల్‌ఖమ్మం జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిపై ఆక్రమణ యత్నాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వే నంబర్ 52లో సుమారు 20 ఎకరాల భూమిని ఎఫ్‌సీఐ గోదాముల నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించినప్పటికీ, వర్దన్నపేట మండలానికి చెందిన కొందరు ప్రైవేట్ వ్యక్తులు అక్రమంగా దారిని సృష్టించి భూమిని ఆక్రమించుకొని దున్నుకుంటున్నారని ఆరోపించారు.
గోదాముల నిర్మాణంలో భాగంగా ప్రహరీ గోడ నిర్మాణానికి కాంట్రాక్టర్ భూమిని చదును చేస్తుండగా, కొందరు వ్యక్తులు పనులను అడ్డుకుని ఆక్రమణకు యత్నిస్తున్నారని తెలిపారు. దీంతో పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులంతా తక్షణం జోక్యం చేసుకుని ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎఫ్‌సీఐ గోదాం భూమిని రక్షించి ప్రహరీ గోడ నిర్మాణాన్ని పూర్తిచేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముద్రబోయిన సుధాకర్, రావుల అనిల్ కుమార్, ఎనగందుల శ్రావణ్, ఐత సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలకు ఆహ్వానం



**భీమదేవరపల్లి/ఏప్రిల్ 4 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండలంలో భారత మాజీ ప్రధాని, దళిత నేత, స్వతంత్ర భారత తొలి కార్మిక మంత్రి బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ కమిటీ చైర్మన్ పచ్చునూరి కరుణాకర్ మాట్లాడుతూ, ఏప్రిల్ 5వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు భీమదేవరపల్లి క్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తాలో జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో దళిత, బహుజన మరియు ప్రజాసంఘాల నాయకులు కుల, మత, రాజకీయాలకు అతీతంగా పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే మండలంలోని సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు కూడా పాల్గొనాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమాన్ని అంబేద్కర్ సంఘం, గ్రామ పెద్దలు మరియు ఇతర సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏర్పాట్ల సమావేశంలో వార్డు సభ్యులు చాగంటి వెంకటేశ్వర్లు, బొల్లంపల్లి శ్యాము, ఎలుకపెల్లి శ్రీనివాస్, టీచర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని నిర్ణయించారు.

# ఉపాధి హామీ నిధుల కేటాయింపులో వివక్ష అనైతికం: పెద్ది సుదర్శన్ రెడ్డి



**నర్సంపేట/ఏప్రిల్ 4 (జర్నలిస్ట్ వార్త):** ఉపాధి హామీ పథకంలో నిధుల కేటాయింపులో వివక్ష చూపడం అనైతికమని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ సర్పంచులు గెలిచిన గ్రామాలకు ఈజీఎస్ నిధులను నిలిపివేయడాన్ని తీవ్రంగా ఖండించారు.
నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా ఉపాధి హామీ పనులు సర్పంచులు, గ్రామ ప్రజల సహకారంతో జరుగుతున్నప్పటికీ, మెటీరియల్ కాంపోనెంట్ కింద వచ్చే అభివృద్ధి నిధులను కేవలం కాంగ్రెస్ పార్టీ సర్పంచులు గెలిచిన గ్రామాలకు మాత్రమే కేటాయించడం వివక్షతకు నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామ సర్పంచులు ప్రజలతో కలిసి కష్టపడి పనులు చేస్తే, బీఆర్ఎస్ సర్పంచులు గెలిచిన గ్రామాలకు వచ్చిన నిధులను పక్క గ్రామాలకు మళ్లించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉపాధి హామీ పనుల్లో గ్రామాల వారీగా ప్రజలు పడిన కష్టాన్ని పట్టించుకోకుండా, ఎమ్మెల్యే స్థాయిలో డివిజన్ యూనిట్‌గా మార్చి నిధులు కేటాయించడం ద్వారా గ్రామాల అభివృద్ధికి గండికొడుతున్నారని విమర్శించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల చేతుల్లో పథకాన్ని పెట్టి, అధికారులు సహకరించడం సిగ్గుచేటని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్, ఈజీఎస్ అధికారులు వెంటనే స్పందించి అన్ని గ్రామాలకు సమానంగా నిధులు కేటాయించి అభివృద్ధికి దోహదపడాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం..

### చెన్నారావుపేటలో ఉచిత చెస్ట్ ఎక్స్-రే శిబిరం



**నర్సంపేట/ ఏప్రిల్ 4 (జర్నలిస్ట్ వార్త):** గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ చెన్నారావుపేటలో నిర్వహించిన ఉచిత చెస్ట్ ఎక్స్-రే శిబిరం శనివారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామ సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి శిబిరాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఊపిరితిత్తుల వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ఈ శిబిరం ఉపయుక్తంగా మారింది. శిబిరానికి గ్రామ ప్రజలు విశేషంగా స్పందించి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఆరోగ్యం కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ప్రజలు ఆరోగ్యంపై మరింత శ్రద్ధ పెట్టాలని, ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సరోజన మాట్లాడుతూ, ఈ కార్యక్రమాన్ని సోమవారం నుంచి గురిజాల, సూరిపల్లి, పాపాయిపేట, అమీనాబాద్ గ్రామాలకు విస్తరించనున్నట్లు తెలిపారు. సంబంధిత గ్రామాల ప్రజలు కూడా ఈ అవకాశాన్నివినియోగించుకోవాలని ఆమె కోరారు. శిబిరంలో సీహెచ్ఓ భద్రయ్య, సూపర్‌వైజర్ రమేల్, వైద్య సిబ్బంది, ఉప సర్పంచ్ దొంతి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ జున్నూతుల రామ్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# చీకటిపై వెలుగుజయం

## ఈస్టర్ పండుగ ప్రత్యేకం

ప్రపంచ క్రైస్తవుల ఆధ్యాత్మిక జీవనంలో అత్యంత ప్రాముఖ్యమైన పండుగగా ఈస్టర్ నిలుస్తోంది. యేసుక్రీస్తు సిలువపై మరణించిన మూడవ రోజున పునరుత్థానం పొందిన సందర్భాన్ని స్మరించుకుంటూ జరుపుకునే ఈ పండుగ, ఆశ, విశ్వాసం, పునర్జన్మకు ప్రతీకగా భావించబడుతుంది. మానవాళికి ప్రేమ, క్షమ, త్యాగం వంటి విలువలను బోధించిన యేసుక్రీస్తు జీవితం ఈస్టర్ సందేశానికి పునాది.

ఈస్టర్‌కు ముందు వచ్చే గుడ్ ఫ్రైడే రోజున యేసుక్రీస్తు సిలువపై మరణించిన ఘట్టాన్ని స్మరించుకుంటారు. ఆ రోజు భక్తులు ఉపవాసాలు పాటిస్తూ, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తూ, సిలువ మార్గ యాత్రల్లో పాల్గొంటారు. యేసు అనుభవించిన వేదనలను గుర్తుచేసుకుంటూ ఆత్మపరిశీలనకు సమయం కేటాయిస్తారు. అనంతరం వచ్చే ఆదివారం ఈస్టర్ పండుగగా ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు.

జిల్లా కేంద్రాల నుంచి గ్రామాల వరకు చర్చిలన్నీ ఈస్టర్ వేడుకలతో కళకళలాడుతున్నాయి. తెల్లవారుజామునే ప్రార్థనలతో ప్రారంభమైన వేడుకలు భక్తి పరవశాన్ని కలిగిస్తున్నాయి. గీతాలాపనలు, బైబిల్ వచనాల పఠనం, ప్రత్యేక ప్రార్థనలు భక్తులను ఆధ్యాత్మికంగా ఉల్లాసపరుస్తున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి ప్రత్యేక విందులు ఏర్పాటు చేసుకుని పండుగను సంతోషంగా జరుపుకుంటున్నారు. ఈస్టర్ పండుగలో భాగంగా పిల్లలు రంగురంగుల ఆడుకోవడం, అలంకరణలు చేయడం వంటి సంప్రదాయాలు కూడా కనిపిస్తున్నాయి. ఈస్టర్ కొత్త జీవనానికి ప్రతీకగా



భావించబడుతుంది. కొన్ని ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు సహాయం చేయడం ద్వారా యేసు బోధించిన ప్రేమ, సేవా భావాన్ని ఆచరణలో చూపిస్తున్నారు.

ఈస్టర్ సందేశం మానవ సమాజానికి ఎంతో ప్రాధాన్యత కలిగింది. ద్వేషం, అసూయలను విడిచిపెట్టి ప్రేమతో జీవించాలని, క్షమాగుణాన్ని అలవరచుకోవాలని ఈ పండుగ సూచిస్తుంది. విభేదాలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ సందేశం మరింత అవసరంగా మారింది.

వ్యక్తిగతంగా కూడా మనలోని చెడు అలవాట్లను వదిలి, కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని ఈస్టర్ ప్రేరేపిస్తుంది. మొత్తంగా ఈస్టర్ పండుగ చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తోంది. నిరాశలో ఉన్నవారికి ఆశను నింపుతూ, జీవితంలో కొత్త ఆరంభానికి దారితీస్తోంది. ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వం వంటి విలువలను బలపరుస్తూ సమాజాన్ని ఒకటిగా కట్టిపడేసే మహత్తర పండుగగా ఈస్టర్ నిలుస్తోంది.



సీనియర్ జర్నలిస్ట్
కొట్టే సుధాకర్ లెనిన్
9908401581

# మనిషి మారనక్కర్లేదు... మనసు మారితే చాలు.

### దృక్పథం మారితేనే సృష్టి కనిపిస్తుంది.. ఆలోచన బాగుంటేనే బతుకు పండుతుంది.



లోకం పోకడ ఎప్పుడూ విలక్షణంగానే ఉంటుంది. సమాజం బాగుపడాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. వ్యవస్థల్లో లోపాలను ఎత్తిచూపుతూ, ఎదుటివారు పద్ధతిగా ఉండాలని శాసిస్తుంటారు. కానీ, వీటన్నింటికీ కేంద్రబిందువైన మనిషి మాత్రం తన అంతరంగాన్ని తొంగి చూడడానికి ఇష్టపడడు. నిజానికి ప్రపంచంలో మార్పు అనేది బయట ఎక్కడో మొదలవ్వాల్సింది కాదు,అది మన ఆలోచనల లోతుల్లో నుంచి ఉద్భవించాల్సిన ప్రక్రియ. అందుకే పెద్దలు చెప్పారు. మనిషి కాదు మారాల్సింది.మనసు మారాలి అని. మనసు సంస్కరించబడినప్పుడే మనిషి మనీషిగా మారుతాడు.

**దృక్పథమే ప్రపంచం.. చూపులోనే సృష్టి.**

మనం ధరించే కళ్లద్దాల రంగును బట్టే లోకం కనిపిస్తుంది. నలుపు అద్దాలు పెట్టుకుని లోకం చీకటిగా ఉందంటే అది అద్దాల తప్పు కాదు, మన ఎంపికలోని లోపం. మనసు కూడా ఒక అద్దం లాంటిదే. అందులో మంచి అనే ప్రతిబింబం పడితే ప్రపంచమంతా పచ్చని తోటలా కనిపిస్తుంది. అదే చెడు అనే విషపు ఆలోచనలు నిండితే, వెన్నెల కూడా వెక్కిరిస్తున్నట్లు అనిపిస్తుంది. యద్భావం తద్భవతి అన్న ఆర్యోక్తి ప్రకారం , మన భావన ఎలా ఉంటుందో, మనకు ఎదురయ్యే ఫలితం కూడా అలాగే ఉంటుంది. మన చూసే చూపులో స్పష్టత ఉంటే, సృష్టిలోని ప్రతి అణువులోనూ ఒక అందం, ఒక పరమార్థం కనిపిస్తుంది.

**ఆలోచనా విధానమే బతుకు అడుగుజాడ**

మంచిగా ఆలోచించడం అంటే కేవలం లోకానికి మంచితనంగా నటించడం కాదు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా సానుకూలతను వెతకడం ఒక కళ. ఒక పూలమొక్కను చూసినప్పుడు.ఒకరికి అందులోని ముళ్లు కనిపిస్తాయి, మరొకరికి ఆ ముళ్ల మధ్య వికసించిన అందమైన పువ్వు కనిపిస్తుంది. సమస్యను కూడా ఒక అవకాశంగా చూపిస్తుంది. ఉన్న అవకాశాన్ని కూడా భారంగా మారుస్తుంది. మనం పరుల మీద చూపించే కోపం, ద్వేషం, అసూయ. మొదట మన మనసును కలుషితం చేస్తాయి. బురదను ఎదుటివారిపై చల్లాలని ప్రయత్నిస్తే, అది వారిపై పడుతుందో లేదో తెలియదు కానీ, మన చేతులు మాత్రం ఖచ్చితంగా మురికి అవుతాయి. ఆలోచించే విధానంలో మార్పు వస్తేనే మన చేతలు మారతాయి. చేతలు మారితేనే సమాజం మారుతుంది.

**సంస్కారమే అసలైన విప్లవం**

మనిషి రూపం మారడం సులభం. కాలానికి అనుగుణంగా వేషధారణ మార్చుకోవచ్చు, హోదా పెంచుకోవచ్చు. కానీ సంస్కారం మారాలంటే అంతర్గత అహం వీడాలి. ఇతరుల తప్పులను వేలెత్తి చూపడం మానేసి, మనలోని లోపాలను మనం సరిదిద్దుకున్న రోజే అసలైన విప్లవం మొదలవుతుంది. మంచిగా ఆలోచించే మనసు ఉన్నచోట శాంతి ఉంటుంది. ఆ శాంతి ఉన్నచోట మాత్రమే సమృద్ధి నెలకొంటుంది. సంస్కారం లేని చదువు, సంస్కారం లేని సంపద రెండూ సమాజానికి భారమే.

**చూపు మారితే.. లోకం మారుతుంది.**

లోకం బాగుపడాలని కోరుకునే ముందు, మన ఆలోచనా సరళిని ఒక్కసారి సమీక్షించుకుందాం. రేపటి ఉదయం కొత్తగా ఉండాలంటే సూర్యుడు మారక్కర్లేదు, మనం చూసే చూపు మారితే చాలు. మనసును ఒక పూదోటగా మార్చుకుంటే, ప్రపంచం ఒక నందనవనంగా కనిపిస్తుంది. ప్రతి మనిషి తన మనసును సానుకూలత వైపు, పరహితం వైపు మళ్లిస్తే ఈ భూమిపై శాంతి వెల్లివిరుస్తుంది. కాబట్టి, ముళ్లని చూసి భయపడటం మానేద్దాం.పువ్వును చూసి పులకించడం నేర్చుకుందాం. ఆలోచన మారుద్దాం.నవ సమాజానికి బాటలు వేద్దాం.



జర్నలిస్ట్ వార్త సి .ఇ.ఓ, సీనియర్ జర్నలిస్ట్
బిర్రు కరుణాకర్
సెల్ నంబర్ 9701249103

# విశ్వశాంతిలో హిడెన్ టాలెంట్ షో

### విద్యార్థుల ప్రతిభకు మెరుగులు

**సత్తుపల్లి,/ ఏప్రిల్ 4 (జర్నలిస్ట్ వార్త):** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతో విశ్వశాంతి విద్యాలయంలో శనివారం నిర్వహించిన “హిడెన్ టాలెంట్ షో” ఉత్సాహభరితంగా సాగింది. కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటారు.జానపద నృత్యాలు, ట్రెడిషనల్ ఫ్యాషన్ షో, గానం, నాటకం, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, నీతి కథలు, మిమిక్రీ, ఫన్నీ పోయెమ్స్, పేరడీలు, భగవద్గీత శ్లోకాల పఠనం వంటి విభాగాల్లో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కొన్ని ప్రతిభలు తొలిసారిగా వెలుగులోకి రావడం విశేషం. ప్రతిభకు ప్రోత్సాహం...విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు సృజనాత్మకతకు వేదిక




కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిలో ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, సరైన అవకాశాలు కల్పిస్తే వారు మరింత ముందుకు సాగుతారని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు కమ్యూనికేషన్ నైపుణ్యాలు, టీమ్‌వర్క్, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో




ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే వేదికగా నిలిచింది.

## మృతురాలి కుటుంబానికి బియ్యం వితరణ



**వర్ధన్నపేట/ఏప్రిల్ 4 (జర్నలిస్ట్ వార్త):**
కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడంలోనే మానవత్వం ఉందని ఇల్లందు గ్రామ నాయకులు సిపిఐ పార్టీ నాయకులు చాటిచెప్పారు. వర్ధన్నపేట మండలం ఇల్లందు గ్రామానికి చెందిన గడ్డం సమ్మక్క ఇటీవల మృతి చెందగా, శనివారం ఆమె కుటుంబ సభ్యులకు గ్రామ నాయకులు అండగా నిలిచారు.

**అండగా నిలిచిన నాయకులు:** సమ్మక్క మరణంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ పేద కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు, వారి కుటుంబ పోషణ నిమిత్తం 25 కేజీల బియ్యాన్ని ఉచితంగా అందజేశారు. రాజకీయాలకు అతీతంగా గ్రామంలోని వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు కలిసి ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కడమంచెలి యాదగిరి , బిక్షపతి, గౌడ సంఘం నాయకులు కత్తి వేణు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గడ్డం సమ్మయ్య,వీరితో పాటు గ్రామ పెద్దలు, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సింగపురం ఇమ్మానియేల్ రాజ్ జన్మదిన వేడుకలు

### -పండ్లు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు



**స్టేషన్ ఘన్పూర్/ ఏప్రిల్ 4 (జర్నలిస్ట్ వార్త) :** స్టేషన్ ఘన్పూర్ సింగపురం ఇమ్మానియేల్ రాజ్ జన్మ దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి సింగపురం ఇందిరా కుమారుడు యువ నాయకు లు సింగపురం ఇమ్మానియేల్



రాజ్ జన్మదిన వేడుకలు శనివారం స్టేషన్ ఘన్పూర్ లోని వారి కార్యాలయంలో శనివారం అట్టహాసంగా జరిగా యి. నియోజకవర్గ అన్ని మండలాల నాయకులు కార్యకర్తలు అభిమానులు ఆయనకు శుభాకాంక్ష, లు తెలిపి కేక్ కట్ చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు చేరుకొని వారికి క్యాంప్ కార్యాలయంలోబాణాసం చాలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంత రం స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ లో పేషెంట్లకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియో జకవర్గ,మండలాల,గ్రామాలముఖ్య నాయకులు, కార్యకర్తలు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## యువతకు పోలీసుల హెచ్చరిక కెనాల్స్, చెరువుల వద్దకు వెళ్తే ప్రాణాపాయం




**వర్ధన్నపేట/ ఏప్రిల్ 4(జర్నలిస్ట్ వార్త):**
వేసవి కాలం దృష్ట్యా సరదా కోసం ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని వర్ధన్నపేట పోలీసులు స్థానిక ప్రజలను, ముఖ్యంగా యువతను హెచ్చరించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ , వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఆదేశాల మేరకు వర్ధన్నపేట పోలీస్ యంత్రాంగం నియోజకవర్గ




పరిధిలోని ప్రమాదకర నీటి వనరుల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టింది.

ప్రస్తుతం ఎస్ ఆర్ ఎస్ పీ కెనాల్ ఉధృతంగా ప్రవహిస్తున్నందున, దాని పరివాహక ప్రాంతాల్లో ఈతలు కొట్టడం లేదా చేపలు పట్టడం వంటి పనులు చేయడం అత్యంత ప్రమాదకరం. ఈ చెరువు చాలా లోతుగా ఉన్నందున, లోతు తెలియకుండా నీటిలోకి దిగడం ప్రాణాపాయానికి దారితీయవచ్చు. వర్ధన్నపేట పోలీసులు ఇప్పటికే కెనాల్ మరియు చెరువుల వద్ద ప్రమాదం లోపలికి దిగరాదు అనే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు, యువకులు స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లే అవకాశం ఉంది. నీటి ఉధృతి, లోతు తెలియక గతేడాది కొన్ని విషాద సంఘటనలు చోటుచేసుకున్నాయి. కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలు చెరువులు, కెనాల్స్ వద్దకు వెళ్లకుండా ఎప్పటికప్పుడు కనిపెట్టుకుని ఉండాలన్నారు. పోలీసుల హెచ్చరికలను కాదని ఎవరైనా నిషేధిత ప్రాంతాల్లో ఈతకు దిగినా, చేపలు పట్టినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ప్రాణాల కంటే ఏదీ ముఖ్యం కాదని, ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.